"ఇదుగో కాఫీ...మిమ్మల్నే. కాఫీ తీసుకో మంటుంటే ఎక్కడో చూస్తా రేమిటి? ఏదో మధుర మైన ఊహల్లో తేలిపోతున్నా రనుకుంటాను." సాగదీసుకుంటూ అంది మీనాక్షి.

"మట్టీ మశానంకాదూ! మధురమైన ఊహలు కూడానూ... ఈ బతుక్కి అదొక్కటే తక్కువ!"

"ఆఁ...ఏవిటీ అంటారూ? నేను విన్లేదు." వంటింట్లోకి నడవబోతున్న మీనాక్షి మళ్ళీ వెనక్కు వచ్చింది.

"నే చెప్పింది నువ్వు వినడం ఎప్పుడు జరిగింది గనుక?"

"అయ్యో... అయ్యో! ఆఫీసునించి వస్తూనే అసుర సంధ్య వేళ ఎంత లే "ని మాట లంటున్నా రూ?"

"ఉన్న మాట అన్నాను. ఏం తప్పా?" నిలబడ్డ చోటే కింద కూలబడింది మీనాక్షి.

"ఔన్లెండి. నా కేవన్నా అందవా, చందవా? లేదు నువ్వు మట్లాడే వాంట్లో. పొద్దుట్నుంచీ సాయంత్రందాకా వాళ్ళని చూ "సిన కళ్ళతో అంటా వు. ఆఫీసులో కళ్ళు మూ సు క్కూచోమనా నీ ఉద్దేశ్యం? లేకపోతే ఆఫీసులో ఉన్నప్పు డో కళ్ళు, ఇంట్లో ఉన్నప్పుడు మరో కళ్ళూ ఉండా లంటావా? నోటి కే దొ స్తే అది వాగేస్తావు."

"నా మాటలు మీకు వాగుడులానే ఉంటాయి. నా ఖర్మ...అసలు తప్పంతా మా నాన్నది. కట్నం తీసుకోడుట... కట్నం తీసుకోడుట అంటూ ఎగిరి గంతులే "సినంతపని చే "సి మీ కిచ్చి కట్టబెట్టాడు నన్ను. కట్నం తీసుకునే వాడికే ఇచ్చి కట్టబెట్టుంటే డబ్బుపసు మొగుడిని కొనుక్కున్న దర్జాతో అధికారం చెలాయించగలిగి ఉండేదాన్ని. హూఁ...నా ఆశల న్నీ నిరాశ లయ్యాయి."

"పోనీ నీ కంత సరదాగా ఉంటే, ఆ కట్నం డబ్బు ఇవ్వ డిమ్మను మీ నాన్నని!" చురక అంటించాడు సుందరం.

"అరవై ఏళ్ళొచ్చి అడ్డ గోడ పట్టుకు నడిచాట్ట. పెళ్ళయి నాలుగ ళ్ళయింది... ఇప్పుడూ."

"ఎన్నే ళ్ళయితేనేం? డబ్బు విలువ పెరుగు తుందే తప్ప తరగదుగా. వడ్డీతో సహా ఇమ్మను."

"చల్లారిపోతుంది. ఆ కాఫీ ఏదో తాగి మరీ కానివ్వండి మీ దండకాలు."


"దండకాలు కాదు. ఇంక మళ్ళీ దండోరా వెయ్యాలి నేను." చిన్నగా నిట్టూర్చి, కాఫీ తాగడం మొదలెట్టాడు.

"దండోరా ఏవిటీ?"

"అదే మరి. అసలు విషయం చెప్పని స్తేగా నువ్వు?"

# ఇదెక్కడి గోల

## తమిరిశ జానకి



ఏవైనా అంటారు. అనండి...అనండి. ఆఫీసులో ఆ టప్పు టప్పు టైపులు కొట్టే అందగత్తె లున్నారు గా. పొద్దున్నించీ సాయంత్రందాకా వాళ్ళని చూ "సిన కళ్ళతో, ఇంటికొచ్చి తారాజువ్వలా నా మీద ఎగురుతారు రాగానే!" కావల్సినంత నిష్ఠూ రం గొంతులో.


"అబ్బబ్బ! కాలికి వే స్తే మెడకి, మెడకివే స్తే కాలికి వెయ్యడంలో నువ్వు వస్తు. ఇక్కడ మనం మనం మాట్లాడుకునేదానికి మధ్యలో ఆఫీసు మాట ఎందుకూ. ఆ టప్పు టప్పు టైపిస్టుల సంగ తెందుకూ? వాళ్ళ అందచందాలు చూస్తూ కూచోడా నికి నేను ఆఫీసు కెళ్తున్నా ననుకున్నా వా? అందుకు జీతం ఇచ్చి ఆఫీసు వాళ్ళు నన్ను పెట్టుకున్నా రనుకున్నావా? పిచ్చిగా అర్థం పర్థం

"బాగానే ఉంది. అసలు విషయం చెప్పక అదీ, ఇదీ మాట్లాడుతున్నది మీరు. మధ్యన నన్నంటా రేమిటి?" ముక్కూ, మూ తీ అందంగా విరుచు కుంది మీనాక్షి.

"సరే. తప్పంతా నాది. భరించు వాడు భర్త అన్నారు. నువ్వేమన్నా భరించి తీరాలి, సరేనా?"

"అయ్యో సంబడం... అంత అదృష్టం కూడానా నాకు? కట్నం తీసుకోని వాడిని కట్టబెట్టాడు కదా మా నాన్న! మా అక్కకి పది వేలు కట్నం పోసి కొన్నాడు. నా కోసం, అందులో సగమైనా ఇవ్వ లేదు."

"ఇది మరీ అన్యాయం, మీనాక్షీ! ఆదర్శాలకి కట్టుబడి, మంచి మనసుతో కట్నం తీసుకోకుండా



పెళ్ళి చేసుకోవడం కూడా తప్పేనా? ఇప్పుడు మనకేం లోటు చెప్పు? అప్పులు చెయ్యకుండా సంసారం నెట్టుకొస్తున్నాం. అది చాలదూ? అదే పెద్ద గొప్ప కాదూ ఈ రోజుల్లో."

"మీకు అర్థం కాదు లెండి. మా అక్క మొగుడికి కట్నం ఇచ్చి నా మొగుడికి ఇవ్వకపోతే తక్కువగా ఫీలవనూ నేను?"

"నాకు లేని ఫీలింగ్సు నీ కెందు కంట? నీ మతి పోగొట్టుకోవడమె కాక నా మతికూడా పోగొట్టేలా ఉన్నావు! నాలుగేళ్ళ కిందట నేను తీసుకోని కట్నం డబ్బు గురించి కాదు మనం ఇప్పు డాలోచించవలసింది. ఇల్లు మారడం గురించి ఆలోచించాలి."

"ఇల్లు మారడమా.. రెండు నెల్లు కూడా అవలే దు ఈ ఇంటికొచ్చి."

"నీకు తెలియని దేముంది? ఏ ఇంట్లో పట్టు మని పది రోజు లున్నాం మనం? పిల్లి పిల్లల్ని మార్చినట్టు ఇళ్ళు మారుతున్నాం. ఇందాక నేను ఇంట్లో కొస్తుంటే గేటు దగ్గరే పట్టుకున్నాడు ఇంటాయన. ఫస్టుకి ఇల్లు ఖాళీ చెయ్యండి అన్నా డు. ఆ ఆలోచనలోనే అలా మాట్లాడకుండా కూర్చుండి పోయాన్నేను కాసేపు. అదీ అసలు విషయం."

"ఊఁ...అయితే మళ్ళీ మొదలెట్టండి ఇళ్ళ వేట. తప్పుతుందా?"

"నువ్వు తల్చుకుంటే తప్పుతుంది ,మీనాక్షీ!"

"ఆఁ..."

"అహ...అలా కోపం తెచ్చుకోకు మరి. ఎన్నాళ్ళ గానో చెప్తూనే ఉన్నాను. నువ్వు పెడ చెవిని పెడుతూనే ఉన్నావు. చిన్న త్యాగం చేశావంటే, చీటికీ మాటికీ ఈ ఇళ్ళు మారే బెడదనించి తప్పించుకో వచ్చును మనం. ఆ హార్మ నీ పెట్టి అటకెక్కి స్తే..."

"ఇదుగో...నేనూ మీకు ఇప్పటి కెన్ని వందలసా ర్లో చెప్పాను- అది కుదరదని. మా అమ్మమ్మ మా అమ్మ కిచ్చిం దా హార్మనీ. మాఅమ్మ నా కిచ్చింది. అది నాకు మా అమ్మ ఇచ్చిన ఆస్తి. వాయించటం, పాడటం మా అమ్మ ముచ్చటగా నేర్పుకుంది నాకు. చిన్నప్పటినించీ సాగుతున్న ఈ సంగీత సాధన ఇలా సాగిపోవల్సిందే. హార్మనీ వాయించుకుంటూ గొంతెత్తి పాడుకోడం అన్నది ఒక్క రోజు కూడా మానలేను నేను. అందుకే...అస లు సొంత ఇల్లు కట్టించుకుంటే ఈ పాట్లు ఉండవు. నా పాటలకి అడ్డు ఉండదు."

"ఉట్టి కెగరలేనమ్మ స్వర్గాని కెగిరిందట. వెనక ఆస్తిపాస్తులు లేని వాడిని, నెల జీతంతో బొటా బొటీగా నెట్టుకొస్తున్న వాడిని...ఇప్పట్లో ఇల్లు కట్టడ మే!"

"చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా అన్నారు. పడం డయితే మీ పాట్లు మీరు...మీ తోటి ఉద్యోగస్తుడు కాదూ ఆ రామనాథంగారు...రెం డుచేతులా సంపాదించ ట్లేదూ?"

"రామ...రామ. ఆయ నుత్త లంచాల మనిషి. అల్లాంటి తప్పుదారిలో భర్త నడుస్తుంటే భార్య సరిదిద్దాలి గానీ..."

"ఏం? భర్తలు తప్పులు చెయ్యడానికే పుట్టారని బ్రహ్మ దేవుడు రాసి పెట్టాడా ఎక్కడైనా?"

"నీతో వాదిస్తూ కూర్చోడానికి ఎంత టైమూ చాలదులే. ఇళ్ళ వేటకి పోవాలి నేను." లేచాడు సుందరం.

"నాకూ వాదిస్తూ కూచోడానికేం టైములేదు. వంట పూర్తిచేసి పాడుకోవాలి, హార్మనీ వాయించుకోవాలి."

భయం భయంగా చూశాడు సుందరం. "కాస్త మెల్లిగా పాడుకో, మీనాక్షీ!"

"చాలా బావుంది.. పాటంటూ మొద లెట్టాక మెల్లగా ఏవిటీ, గట్టిగా ఏవిటీ... నా గొంతు ఎంత లేస్తే అంతానూ!"

"గొంతు టాపు వరకూ లేస్తుంది. అందులో ఢోకా లేదు." గొణుక్కుంటూ బయటికి నడిచాడు.

** ** **

"ఈ ఇల్లు నాకు బాగా నచ్చిందండీ!" కొత్త ఇంట్లోకి మారాక ఓ రోజు అంది మీనాక్షి.

అది రెండు గదుల పోర్షన్. పక్క పోర్షన్‌లో ఇంటి వాళ్ళు ఉన్నారు.

"మనకి ఇల్లు నచ్చడం కాదు కావలసింది. ఇంటివాళ్ళకి మనం నచ్చడం కావాలి." మనసులో బాధ మాటల్లో వెళ్ళగక్కాడు సుందరం.

"పోదురూ బడాయి. మనకేం? మన జంట మూడ ముచ్చటగా ఉందని మన పెళ్ళిలో నా స్నేహితురాళ్ళుతెగ పొగిడేశారు తెలుసా?"

"అయ్యో రామ!" నెత్తి పట్టుకుని కుర్చీలో కూల బడ్డాడు."మన జంట చూడ ముచ్చటగా ఉందా, లేదా అన్నది కాదు ఇంటివాళ్ళ క్కావలసింది."

"ఇంటావిడ నాతో చాలా బాగా మాట్లాడు తోందండీ. మంచావిడ లాగానే ఉంది."

"ఆఁ...ఆఁ... నాల్రోజులు వరసగా నీ పెట్టి వాయిద్యం విందంటే తెలిసిపోతుంది ఆవిడ మంచితనం."

** ** **

"అమ్మాయ్! ఏం చేస్తున్నావు?"

"రండి.పిన్నిగారూ!" గుమ్మంలో నిలబడ్డ ఇంటావిడని లోపలికి ఆహ్వానించింది మీనాక్షి.

"నువ్వు చాలా బాగా పాడతావు, హార్మనీ కూడా మా బాగా వాయిస్తావు. రోజూ సాయంత్రం నీ వాయిద్యం, పాటా చెవుల్లో వాయించినట్టే వినవడుతోంది మా వాటాలోకి. సంగీతం అన్నది ఓ గొప్ప కళ అనుకో. ఎవరికి పడితే వాళ్ళకి రాదు."

మీనాక్షి మొహంలో చెప్పలేనంత సంతోషం. ఇన్నాళ్ళకి...ఒక్కళ్ళంటే ఒక్కళ్ళయినా తన వాయిద్యాన్నీ, పాటనీ మెచ్చుకున్న వాళ్ళు దొరికారని పొంగిపోయింది.

"ఏమిటో నమ్మాయ్! అడగాలంటే ఏదో ఇదిగా ఉంది. కానీ...నువ్వు నా కూతురి లాంటి దానివి. అడిగినా , నువ్వేమీ అనుకోవని నాకు తెలుసు."

"ఫర్వాలేదు. అడగండి, పిన్నిగారూ, నే నేమీ అనుకోను. మిమ్మల్ని చూస్తుంటే మా అమ్మని చూ °సినట్టే ఉంది."

"నా తల్లే! నాకు తెలుసు. నీది చాలా మంచి మనసు. ఓ రెండు గ్లాసుల సెనగ పప్పుంటే ఇవ్వమ్మాయ్."

"అయ్యో! దానికేం భాగ్యం. తప్పకుండా ఇస్తాను, ఉండండి." సెనగపప్పు పట్టుకొచ్చి అందించింది.

"వడలు తినాలని ఉందని పిల్లలు నిన్నటి నించీ నా ప్రాణాలు తీ సేస్తున్నా రనుకో. ఈ కాలంలో ఎనమండుగురు పిల్లల్తో సంసారం సాగించటం కంటే, రాకేష్ శర్మలా రాకెట్‌లో వెళ్ళి రావడం సులువంటారు మా ఆయన. తప్పు తప్పని చెంపలేసుకుంటా న్నేను. పిల్లలు లేని వాళ్ళు లేరో అని ఏడుస్తుంటే, ఉన్న వాళ్ళం ఇలా అనుకుంటే ఎలా?"

"పిల్లలు ఉండాలనుకోండి. ఇంపుగా ఇద్దరో, ముచ్చటగా ముగ్గురో మాత్రమే ఉండాలంటారు మా వారు."

"ఈ మగాళ్ళ మాటలు పట్టించుకో కమ్మాయ్ నువ్వు. బొత్తిగా లోకజ్ఞానం లేనిదానిలా ఉన్నావు పాపం. మొగుడు చెప్పినట్టల్లా విని గంగిరెద్దులా తలూపితే లోకువగా చూస్తారు. మెత్తని వాళ్ళని చూ స్తే మొత్త బుద్ధి అన్నట్టు ప్రవర్తిస్తారు. ఆడదీ ఓ మనిషే అన్నది వాళ్ళు గుర్తించేలా నడుచుకోవడంలో ఉంది మన ప్రతిభ అంతా. అందుకే నేను చూడు. మా ఆయన ఎడ్డెం అంటే. నేను తెడ్డెం అంటాను. సరే మరి నే నొస్తా నమ్మాయ్! ఏదో పిచ్చి మొద్దుని. నా కూతురిలాంటి దానివి కదా... నా పిల్లల్తోపాటూ నీ మంచీ చెడ్డా కూడా చూడటం నా విధి అన్న ఉద్దేశంతో ఉన్నమాట చెప్పాను తప్ప మీకూ మీకూ తగవులు పెట్టాలని కాదుసుమా ఆ మరి నే నొస్తానూ. ఆ వడలేవో చే °సి వడే స్తేగాని మాకోతి మూ క ఊరుకోదు." రెండడుగులు ముందు కెళ్ళిన సత్యవతమ్మ మళ్ళీ పూర్తిగా రెండడుగులూ వెనక్కి వొచ్చి గొంతు తగ్గించి మెల్లగా అంది-"చూడమ్మాయ్! ఇంట్లో మగాడికెంత హక్కుందో, ఆడదానికీ అంతే హక్కు ఉంటుంది. మన వ్యక్తిత్వం మనం నిలబెట్టుకోవాలి. మాట వరసకి చెప్తున్నానూ...ఇరుగింటికో పొరుగింటికో పోయి గ్లాసుడు పప్పో, పంచదారో అప్పు తెచ్చుకునే హక్కు నా కుండకూడదని మా ఆయన అనకూడదు. అల్లాగే నా బోటిదానికి అప్పు ఇచ్చే హక్కు నీ కుండ కూడదని మీ ఆయనా అనకూడదు. అంతేగా మరి. ఔనా?"

"ఔనండీ...ముమ్మాటికీ నిజం."

"వెళ్ళొస్తానమ్మా!" నీళ్ళల్లో నానబో స్తే తప్ప, కబుర్లతో సెనగపప్పు నానదని తప్పనిసరిగా అప్పటికి కదిలిం దక్కడి నించి సత్యవతమ్మ.

** ** **

"మీనాక్షీ! ఎంత వెదికినా సూదీ, దారం ఎక్కడా కనబడదే? ఎక్కడ పెట్టావు? ఈ షర్టుకి బటన్ కుట్టుకుని వేసుకోవాలి."

కంగారుగా తను కూడా వెతికింది మీనాక్షి.

"నాకు టైమైపోతోంది. అర్జంటుగా బయటికి వెళ్ళాలి. కనబడిందా?" మళ్ళీ మళ్ళీ అడిగాడు సుందరం.

"అయ్యో! నా మతిమండిపోనూ. నాల్రోజుల కిందట ఇంటి వాళ్ళ పెద్దమ్మాయి పట్టుకెళ్ళిందండీ మనసూదీ, దారంబంతీనూ -మళ్ళీ కొంచెం సేపట్లో పట్టుకొచ్చి ఇచ్చేస్తానంటూ. ఇంకా ఇవ్వలేదు. ఉండండి అడిగి పట్టుకొస్తాను ఒక్క నిమిషంలో." ఇంటి వాళ్ళ గుమ్మంలోకి పరిగెత్తింది మీనాక్షి.

"సర్గా...సర్గా.." ఇంటివాళ్ళ పెద్దమ్మాయిని పిలిచింది.

ఆ సర్గ పూర్తి పేరు సత్య వెంకట రమణ వీర మహాలక్ష్మీ కనకదుర్గ. ఆ పొడుగు పేరుని అందంగా కట్ చే °సి సర్గ అని పిలవమంటుంది అందర్నీ. రేడియోలో వస్తున్న -"తిమ్మిరెక్కిందా" పాటతో తను కూడా గొంతు కలిపి గట్టిగా పాడుతున్న ఆ సదరు సర్గ వినుగ్గా మొహం పెట్టి చూ °సింది.

"ఏంటి, ఆంటీ?"

"ఆ రోజు సూదీ, దారం తీసుకున్నావు కదమ్మా. ఇస్తావా? అర్జంటుగా కావాలిట ఆయనకి."

"అబ్బ! చాలా మంచి పాట వొస్తోందండీ రేడియోలో. ఇప్పు డిక్కడి నించి కదల్లేను, ఆంటీ! నేను వింటున్నాను. అమ్మ వంటింట్లో ఉంది. వెళ్ళి అమ్మ నడగండి, ఆంటీ!"

మొహం చిన్నబుచ్చుకుని వంటింటి గుమ్మం దగ్గరి కెళ్ళింది మీనాక్షి."పిన్నిగారూ సూదీ, దారంబంతీ ఇస్తారా?"

"అయ్యోరాత. మా ఇంట్లో సూదులూ, దారాలూ కూడానా?"

"అదికాదండీ, నాల్రోజుల కిందట మీ అమ్మాయి మా ఇంట్లోంచి పట్టుకొచ్చింది."

"అలాగా! నాకు తెలియదు మరి. దాన్నే అడక్క పోయావు టమ్మాయ్?"

"అడిగా నండీ. మిమ్మల్ని అడగమంది."

"అంటుంది... అంటుంది. సాక్షాత్తూ ఆ శ్రీ మహావిష్ణువే పుష్పక విమానం తోలుకొచ్చి ఈ నిమిషంలో వైకుంఠం తీసుకెళ్తాను ఎక్కమన్నా కూడా, కా సేపు ఆగమని నిలబెట్టే సేంత బిజీగా నే నిక్కడ పన్లో మునిగి తేలుతుంటే న న్నిమ్మటుందా? ఎక్కడ పెట్టిందో అది? నే నెక్కడని వెతకనూ! ఈ ఇల్లో కారడవి. పెట్టిన వస్తువు పెట్టిన చోట ఉండి ఛస్తుంది కనకనా? మొన్నటికి మొన్న మామూ డో పిల్ల ఏం చే °సిం దనుకున్నావు..."

"సరే. ఆనక కనపడితే తీసుంచండి, పిన్నిగారూ! వస్తాను. అవతల ఆయన అర్జంటుగా బయటి కెక్కడికో వెళ్ళాలని చిందులు తొక్కుతున్నారు."

"ఏమిటో బొత్తిగా లోకజ్ఞానంలేని పిల్లవి. నిన్ను చూ స్తే మహా జాలే °సి పోతుందనుకో నాకు. ఆయన... ఆయన అంటూ అగ్గగ్గలాడిపోతావు. అయినా, అంత అర్జంటుగా ఈ వే ళప్పుడు ఆయన గా రెక్కడికో ప్రయాణం?"

"ఏమో, తెలిదండీ."

"అయిందీ...మంగళం."

"ఏమిటి, పిన్నిగారూ!" అయోమయంగా చూ °సింది మీనాక్షి.

"మెల్లిమెల్లిగా ఇలాగే ఎక్కడికో చెప్పకుండా, చిల్లర తిరుగుళ్ళు అలవాటు చేసుకుంటా రమ్మాయ్! నీ జాగ్రత్తలో ను వ్వుండాలి."

"ఆc..." నోట మాట రాలేదు మీనాక్షికి భయంతో.

"మీనాక్షీ..మీనాక్షీ!" ఇహ లాభం లేదనుకుని, వాకిట్లో నిలబడి కేకేశాడు సుందరం.

"ఆc...ఆc... వొచ్చేశా."

"సూదీ, దారం తేవడాని కింత సేపా? అవతల నే నర్జెంటు పనిమీద వెళ్ళాలని చెప్పానా?"

"ఏమిటో ఆ అర్జంటు పని... ముందు అది చెప్పండి?" సత్యవతమ్మ మంత్రోపదేశం బాగా పనిచే °సింది మీనాక్షిమీద.

"కుట్టుకుంటూ మాట్లాడుకోవచ్చు. ముందవి ఇలా పడెయ్యి."

"లేవు."

"లేవా? వాళ్ళు తీసుకున్నా రన్నావుగా?"


"ఎక్కడ పెట్టారో కనపడలేదు."

"చంపావు. ఈ షర్టు ఇ °స్త్రీగా కాస్త బావుంది. బటన్ కుట్టుకుని వేసుకుపోదామని నేను చూస్తుంటే!" ఆ మా °సిన షర్టే మళ్ళీ తొడిగేసుకున్నాడు.

"నేను అడిగిన దానికి జవాబు చెప్పారు కాదు. అంత అర్జంటుగా ఏం పని మీద వెళ్తున్నారు?"

"ఆఫీసులో రేపు ఇన్ స్పెక్షన్ నోటి ఏడ్చిందిలే. ఆఫీసు విషయ మేదో మాట్లాడటానికి ఓ సారి వెంటనే రమ్మని మా ఆఫీసర్ కబురు చేశారు."

ఈ జవాబు చాలా చప్పగా అనిపించింది మీనాక్షికి. అసలు ఎక్కడి కెళ్తున్నానో చెప్పననో, నే నెక్కడి కెళ్తే నీ కెందుకనో అలాంటి సమాధానా లేవైనా ఎన్తాయేమోనని యుద్ధానికి రెడీగా ఉంది.



మీరు చేప్పిందే నిజమండోయ్ పిన్నిగారూ అంటూ, అవసరమైతే రంగంలోకి ఆవిడని కూడా పిలిచి తనకి సపోర్టు తెచ్చుకోవాలనుకుంది. అంతా చివరికి తుస్సుమంది.

** ** **

"నా చిన్ననాటి ఫ్రెండొకడు ఇవాళ సాయంత్రం మనింటి కొస్తాడు మీనాక్షీ. టిఫినేమన్నా చేసి ఉంచు. పకోడీలూ, సేమ్యా పాయసం చెయ్యి. ఆ రెండూ వాడికి చాలా ఇష్టం." పొద్దున్న ఆఫీసుకి బయల్దేరుతూ అన్నాడు సుందరం.

"మరి...మరి... సెనగపిండి, సేమ్యా రెండూ లేవు."

"అదేమిటీ? నెలకి సరిపడా సరుకులన్నీ తెచ్చి పడేసి వారం రోజులు కూడా అవలేదు. అప్పుడే అయిపోవడం ఏవిటి? సరుకులు కొన్నాక ఇంతవరకూ నువ్వు సెనగ పిండితోగానీ, సేమ్యాతోగానీ ఏవీ చెయ్యలేదు కూడానూ."

"పాపం... పెద్ద సంసారం గలవాళ్ళు కదండీ. పక్కింటి పిన్నిగారు ఏదో అప్పుడప్పుడు అడిగి పట్టికెళ్తూ ఉంటారు."

"సరే...సాయంత్రం వొచ్చాక అవన్నీ తీరిగ్గా వింటాను. నాకు టైమైంది ఆఫీసుకి. నీకు తోచిన టిఫినేదో చెయ్యి."

** ** **

"చూడు, మీనాక్షీ! ఇలా అయితే చాలా కష్టం. ఈ ఇంటి కొచ్చాక మనకి ఇదివర కెప్పుడూ అవనంత ఖర్చవుతోంది నెలకి. ఇలా అయితే లాభం లేదు. అప్పుల్లో మునిగిపోతాం."

"నేనేం చెయ్యనూ?"

"ప్రతిరోజూ ఇది కావాలి- అది కావాలి-కందిపప్పు కావాలి, పెసరపప్పు కావాలి, పంచదార కావాలి, కాఫీ పొడి కావాలి అంటూ ఆఖరికి దోమలకి కొట్టడానికి ఫ్లిట్, బొద్దింకల్ని చంపడానికి బేగాన్ దగ్గర్నించి అప్పుతీసుకుంటున్నట్టు, తీసుకుంటూ తిరిగి ఇవ్వడమన్నది లేకుండా పక్కింటివాళ్ళ సంసారం ఖర్చులు చక్కగా తగ్గించుకుంటూ, మన నెలసరి బడ్జెట్ పెంచేయడం, మనల్ని చిక్కుల్లో పెట్టేయడం ఏమీ బాగులేదు. అన్యాయం. ఇంకనించీ ఆవిడ ఏ వడిగినా ఇవ్వకు. లేదని చెప్పు."

మీనాక్షి గుండెలో రాయి పడింది. తన పాటని మెచ్చుకునే పిన్నిగారికి...ఏదన్నా కావాలంటే లేదనీ, ఇవ్వననీ చెప్పడమా? ఉహూ...తనవల్ల కాదు. ఇన్నాళ్ళకి తన పాటని మెచ్చుకునే మనిషి ఒకళ్ళయినా దొరికినందుకు తన కెంత సంతోషంగా ఉంది. అలాంటి పిన్నిగారు ఏవడిగినా తను ఇచ్చి తీరుతుంది. తీసుకున్న సరుకేదీ తిరిగి ఇవ్వక్లే దావిడ...అయినా సరే ఇవ్వక మానదు తను. ఔనుమరి./ తన వాయిద్యంలోని సొంపుని, తన గొంతులోని మాధుర్యాన్ని తెలుసుకోగలిగిన ఒకే ఒక వ్యక్తి ఆవిడ.

** ** **

"వాళ్ళని ఇల్లు ఖాళీ చెయ్యమని చెప్పవే అని రోజు నేను నీతో మొత్తుకున్నా, వల్లకాదంటావు నువ్వు. పిల్లలు చదువుకునే వేళ, ఆవిడ సంగీత సాధన వేళ ఒకటి ప్రతిరోజూ. చదువుకునేది బుర్ర కెక్కట్లేదని గోల పెట్టేస్తున్నారు పిల్లలు. నాకు సంగీతాలూ, సింగినాదాలూ అంటే తల నెప్పని నీకూ తెల్సు. ఇలాగే కొన్నాళ్ళుంటే నాకు పిచ్చెక్కడం ఖాయం-ఆ సంగీతాల సొంపుకి." సతీవ్రతుడు శివరావు మొర పెట్టుకున్నాడు భార్యామణితో.

"అమ్మలాంటి వాళ్ళతో నిత్యం వేగుతున్నా పిచ్చెక్కని వాళ్ళకి, ఇంక జీవితంలో ఏరకంగానూ పిచ్చెక్క లేదు, నాన్నా! నీ కా భయం అక్కర్లేదు." ఓ చిన్న సన్నాయి నొక్కు నొక్కింది రెండో కూతురు రాకాసి, పూర్తి పేరు రామ కాత్యాయినీ సింగారం. ఇంట్లో వాళ్ళు మామూలప్పుడు సింగారం అనీ, కోపం వచ్చినప్పుడు రాకాసి అనీ పేరుని పార్టు కట్ చేసి పిలుస్తారు ముద్దుగా.

"రాకాసి మొద్దా! ఎంతలేసి మాటలు పడితే అంతలేసి మాట లంటావుటే?" కోపంతో తల్లి చెయ్యి కొట్టడానికి లేవగానే అక్కడి నించి పారిపోయిందా పిల్ల.

** ** **

"మీ మొహంలో సరస్వతి తాండవిస్తోంది. మీరు గొప్ప సంగీత పాటకులని మీ మొహంలోనే తెలిసిపోతోంది నాకు."

"ఏదో లెండి...గొప్పవాళ్ళకే గొప్పవాళ్ళ ప్రజ్ఞలు తెలుస్తాయని మా అమ్మ మేనమామ బావమరిది కూతు రొకత్తి అంటూ ఉండేది." తెగ మెలికలు తిరుగుతూ సిగ్గుపడిపోయింది మీనాక్షి.

"మీకు పిల్లలంటే మహాఇష్టం. కానీ పాపం..." ఆగిపోయాడు ఆచారి.

నీది గొప్ప ఐడియాల బుఱ్ఱ కదరా ఆచారీ-ఏద్రైనా ఓ మాంచి ఐడియా వేసి మాఆవిడ సంగీత సాధన ఆపించి నెలకీ, రెణ్ణెల్లకీ ఓ ఇల్లు మారే గతినించి నన్ను తప్పించి పుణ్యం కట్టుకో. నీ ఋణఋ ఉంచుకోన్లే అంటూ సుందరం బతిమాలగా, సుందరం ఇంట్లో లేని టైములో వచ్చాడు ఆచారి. కొద్దో, గొప్పో జాతకం చూడటం ఆచారికి వచ్చని మీనాక్షికి తెలుసు.

"ఏవిటి, ఆచారిగారూ, ఆగిపోయారేం చెప్పండి?" కంగారుపడింది మీనాక్షి.

"ఎందుకులేమ్మా! మీ క్కోపం రావచ్చు."

"అబ్బే! కోపం రాదు. చెప్పండి." కాగితమ్మీద చక్రం గీసి ఏవేవో లెక్కలు వేస్తున్న ఆయన మొహంలోకి భయం భయంగా చూసింది.

"మీకు అత్యంత ప్రియమైన ఆ సంగీత సాధన మహా త్యాగం చేస్తేగాని మీకు సంతాన యోగం లేదు."

ఆటంబాంబు పేలినట్టు అదిరిపడింది "అదేవిటండీ! దానికీ, దీనికీ ఏవిటి సంబంధం?"

"అలా అడిగితే నేనేం చెప్పను, తల్లీ! అంతా ఆ సుందరేశుని లీల. సత్యం శివం... సుందరం."

"అయ్యో! అయితే నా హార్మనీ పెట్టి అటకెక్కక తప్పదా?"

"అమ్మమ్మ! ఆ పనిమాత్రం చెయ్యకండి. అటకెక్కిస్తే మళ్ళీ ఎప్పుడైనా దింపుకునే ప్రమాదం ఉంది. దక్కిందే దిక్కుడని, ఎంతో స్తే అంత. ఏదో ఓ రేటుకి ఎవరో ఒకరికి అంటకట్టెయ్యండి." వొచ్చిన పని ముగించి లేచాడు ఆచారి.

** ** **

"నిజమా, శాస్త్రిగారూ!" తెల్ల మొహం వేసింది సత్యవతమ్మ.

మా ఆవిడ మా ఇంట్లో అద్దెకున్న వాళ్ళచేత ఖాళీచేయించేట్టు ఓ మంచి ప్లాను వెయ్యి. నీ రుణం ఉంచుకోను అంటూ శివరావుగారు కోరగా ఓ మాంచి ఐడియాతో వచ్చాడు శాస్త్రి.

"ఔనమ్మా...మీ పేరు సత్యవతమ్మ."

"చచ్చి స్వర్గాన ఉన్న మా అమ్మమ్మ పేరు. ముద్దుగా నాకు పెట్టింది మా అమ్మ."

"మీ ఆయన పేరు శివరావుగారా?"

"వాళ్ళ తాతగారి పేరట. ఏం బాగుందనీ ఆ పేరు...అందమా, చందమా?"

"ఆ అద్దెకున్నాయన పేరు సుందరం కదా!"

"ఏదో లెండి...సుమారైన పేరు."

"మూడు 'ఎస్'లు ఈ ఇంట్లో కలవటానికి వీల్లేదు. 'ఎస్' అనే అక్షరంతో పేరు మొదలైన వాళ్ళకి ఈ ఇంట్లో అద్దెకిస్తే మీ ఆయనకి అరిష్టం. ఆ తర్వాత మీ ఇష్టం. ఈ జాతక చక్రం నా కదే చెప్తోంది."

** ** **

"అయ్యో! అదేవిటండీ ఇల్లు ఖాలీచెయ్యమంటారు. మేము హార్మనీ పెట్టి అమ్మేశావండీ!" దీనంగా చూశాడు సుందరం.

"మీరు హార్మనీ పెట్టి అమ్మేసుకున్నారో, ఆవకాయ జాడీ కొనుక్కున్నారో మా కనవసరం...ఫస్టుకి మీరు ఇల్లు ఖాళీ చెయ్యవలసిందే." కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేసి వెళ్ళిపోయింది సత్యవతమ్మ.

"చచ్చాం...మళ్ళీ ఇల్లు మారవలసిందేనా! ఇదెక్కడి గోలరా దేవుడా!" నెత్తిన చేతు లెట్టుకుని అరుగు మీద కూలబడ్డాడు సుందరం. ●

